క్లుప్తంగా

రోగికి చేయూత



రోగి కుటుంబీకులకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లికి చెందిన సలాది వెంకటేశ్వరరావుకు గుడ్ సీడ్ ఫౌండేషన్, మిరాకిల్ మినిస్ట్రీస్‌లు ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను సమకూర్చాయి. గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే వెంకట రమణారావు స్పందించి ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను స్థానిక గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం రోగి కుటుంబీకులకు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు గంటా లక్ష్మీప్రసాద్, పరమట రాజేష్, విప్పర్తి రమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెంలో జంపన సూర్యనారాయణరాజు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు సుమన్‌వర్మ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారామణరాజు విగ్రహాన్ని ఆవిష్కరించి, రోగులకు ఉచితంగా మందులను అందజేశారు.

ఎరువుల కొరత అరికట్టాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముమ్మిడివరం: ఎరువుల కొరతను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కొరతను నివారించి రైతులకు న్యాయమైన ధరలకు ఎరువులు అందించాలని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు పి.ఉదయభాస్కర వర్మ, వడ్డి నాగేశ్వరరావు, గుబ్బల రవి, వేగిశ్న నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



పీఈటీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న పరమట విష్ణుప్రసాద్ ఇటీవల జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. బుధవారం ఆ పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఆయన్ని కలిసి సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, నాయకులు నూకపెయ్యి గంగాధర్‌రావు, కుమార్, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు భోజనాల ఏర్పాటు



ఆనంద నిలయంలో చిన్నారులకు భోజనాలు వడ్డించిన నాగరాజు, కిశోర్

తాళ్లరేవు: స్థానిక ఆనంద నిలయం చిన్నారులకు యానాంలో పుట్టి ఫ్రాన్స్‌లో స్థిరపడిన పంపన నాగరాజు, కిశోర్‌లు భోజనాలు ఏర్పాటు చేశారు. వారి మాతృమూర్తి, దివంగత పంపన శాంత కుమారి జ్ఞాపకార్థం బుధవారం చిన్నారులకు భోజనాలు వడ్డించారు. ఆనంద నిలయం ప్రతినిధి, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్ తదితరులు ఉన్నారు.

రెండు ఆటోల ఢీ

అమలాపురం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో మున్సిపల్ కార్యాలయం సమీపంలో రెండు ఆటోలు ఢీకొన్నాయి. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మాదాశి వెంకటరమణ కంటికి తీవ్ర గాయమైంది. కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి నుంచి బుధవారం వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు.

రైతులకు అవగాహన సదస్సు

కాట్రేనికోన: ఉప్పూడిలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీ వద్ద మండల వ్యవసాయ అధికారి మృదుల మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. రైతు సంఘం మాజీ అధ్యక్షుడు రంబాల సుభాష్ చంద్రబోస్, నీటి సంఘం అధ్యక్షుడు బండారు ఏసుబాబు, సలాది తులసీరావు, రంబాల దొరబాబు తదితరులు ఉన్నారు.

ప్రగతి లేకుండా..

- రూ.కోట్ల సీఎస్ఆర్ నిధులకు గ్రహణం
- రాజకీయ ఒత్తిళ్లతో నిలిచిన పనులు
- టెండర్లు పూర్తయినా ప్రారంభించని వైనం

యానాం: దేవుడు వరమిచ్చినా పూజారి కురుణించలేదన్న చందాన యానాంలో పరిస్థితి ఉంది.. సమృద్ధిగా నిధులున్నా అభివృద్ధి పనులు అక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నట్లు మారింది.. ఖజానాలో రూ.కోట్లు మూలుగుతున్నా పనులు నిలిచిపోవడం, దానికి కారణం అధికారులే కావడం ఇక్కడి పాలనను వెనకడుగు వేయిస్తుంది. పనులు చేపట్టాల్సిన వారే తమకు రాజకీయ ఒత్తిళ్ల అంటూ తప్పించుకోవడంతో ప్రజలు విస్తుపోయేలా చేస్తోంది.

యానాం నియోజకవర్గానికి సరిహద్దుల్లో రిలయన్స్, ఓఎన్జీసీ వంటి చమురు సంస్థలు ఉన్నాయి. తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)గా చెల్లించాల్సిన నిధులు అటు ఆంధ్రప్రదేశ్‌తో పాటు యానాంకు సైతం రూ.కోట్ల మేర మంజూరు చేస్తున్నాయి. ఈ సొమ్ముతో ప్రజాపయోగ పనులు ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తదితర మౌలిక సౌకర్యాల కల్పనకు వినియోగించాల్సి ఉంది. ఈ నిధుల మంజూరుకు సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తారు. దీంతో రాజకీయపరమైన జోక్యం పెరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి.

ముందుకు కదలక..

యానాం నియోజకవర్గంలో సీఎస్ఆర్ నిధుల ద్వారా పనులు చేపట్టేందుకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపగా చాలావరకు టెండర్లు పూర్తయినా, పనులు ముందుకు కదలని పరిస్థితి ఉంది. ఇక్కడి ప్రజల దాహార్తి తీర్చే నల్లచెరువు రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణకు రూ.5.50 కోట్లు, బైపాస్ రహదారి నుంచి ఎస్‌బీఐ వరకూ రోడ్డు ఆధునీకరణకు రూ.6 కోట్లు, అదేవిధంగా ప్రస్తుతం ఉన్న అన్ని స్కూళ్లను స్మార్ట్ స్కూళ్లుగా మార్చేందుకు రూ.2.86 కోట్లు, పట్టణంలో పాత విద్యుత్ దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటుకు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, మెట్టకూరు ఫిషర్‌మెన్‌పేటలో ఆర్‌సీసీ ప్లాట్‌ఫామ్, దొమ్మేటిపేటలో నావిగేషన్ ఛానల్‌మౌత్ పనులు, ఫెర్రీలో ఫిష్ ఆక్షన్ ప్లాట్‌ఫామ్, యూకేవీ నగర్‌లో మల్టీపర్పస్ హాల్ నిర్మాణం, సాయ్ అకాడమీకి హాస్టల్ బిల్డింగ్, తదితర పనుల ప్రతిపాదనలకు ఆమోదంతో పాటు టెండర్లు జరిగినప్పటికీ పనులు కదలడం లేదు. దీనికితోడు 2021లో సీఎస్ఆర్ నిధులు రూ.21.80 కోట్లు మంజూరు చేసి పలు నిధులు మున్సిపాలిటీ అకౌంట్‌లో మూలుగుతున్నా పనులు ప్రారంభించలేదు.



సీఎస్ఆర్ నిధులున్నా, మొదలుకాని రక్షిత నల్లచెరువు ఆధునీకరణ పనులు

ఇదే కారణమా?

యానాం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ప్రస్తుత ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతిలో సీఎం రంగసామి ఓటమి పాలయ్యారు. అయితే సీఎస్ఆర్ నిధుల మంజూరుకు చైర్మన్‌గా సీఎం వ్యవహరిస్తుంటారు. యానాంలో ఆయన తనపై ఓటమి చెందడంతో ఇక్కడి నుంచి పనులకు సంబంధించి ఏ ప్రతిపాదన పెట్టినా దానిని ఆపేస్తున్నారని ఎమ్మెల్యే అశోక్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సైతం అడ్డుపడుతున్నారని ఆరోపించారు. గత ఆర్ఏఓ మునిస్వామి వైఖరితో పనులన్నీ నిలిచిపోయాయని, కొన్ని పీడబ్ల్యూడీ అధికారుల ద్వారా జరగాల్సి ఉండటంతో వారు సైతం పనులు మానేసి కొంతమంది నాయకులకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆయన అన్నారు. సీఎస్ఆర్ కాకుండా ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మూడేళ్లలో రూ.6 కోట్లు, ఏడీ వెల్ఫేర్ రూ.కోటి, నామినేటెడ్ ఎమ్మెల్యేల నిధులు రూ.కోటికి సంబంధించి పనులు సైతం జరగాల్సి ఉందని, ఇవన్నీ జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి..



యానాంలో అభివృద్ధి పనులు జరగకుండా స్థానిక పీడబ్ల్యూడీ అధికారులు కాలయాపన చేస్తున్నారు. సీఎస్ఆర్ నిధులు కూడా ఖర్చు చేయడం లేదు. రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గారు. వీరిపై ఎల్జీ కైలాషనాథన్‌కు ఫిర్యాదు చేశాను. పనుల చేపట్టాలని అవసరమైతే మళ్లీ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటాను.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

పనుల ప్రారంభానికి చర్యలు

నియోజకవర్గ పరిధిలో రూ.కోట్ల విలువైన సీఎస్ఆర్, ఎమ్మెల్యే ల్యాడ్, ఆదిద్రావిడ శాఖ నిధులతో భూమి పూజ చేసిన పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. జనవరిలో ప్రజా ఉత్సవాల సమయంలో సీఎం రంగసామి భూమి పూజలు చేసిన పనులు సైతం మొదలు పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– కాళ్ల నాగరాజు, పీడబ్ల్యూడీ ఈఈ, యానాం

అభివృద్ధికి కృషి అభినందనీయం



కలెక్టర్ మహేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: జిల్లాను అభివృద్ధి పథంలో పయనించేలా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కృషి చేస్తున్నారని రెవెన్యూ అధికారులు అన్నారు. బుధవారం కలెక్టర్ జన్మదిన సందర్భంగా అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఆయన్ని అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టర్ మహేష్ కుమార్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, డీఆర్వో మాధవి, ఏఓ కాశీవిశ్వేశ్వరరావు, డీఐపీ ఆర్ఓ సీహెచ్ శ్రీనివాస్, డీపీఆర్వో రామిరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మాక్‌డ్రిల్

యానాం: సునామి మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆర్ఏఓ అంకిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం తీర ప్రాంత గ్రామాలైన సావిత్రినగర్, గిరియాంపేట ప్రాంతాల్లో ఉదయం 8 గంటలకు రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

రక్షిత నీటి పథకం పరిశీలన



ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: కనకాలపేటలో రక్షితనీటి పథకం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మంగళవారం క్లోరిన్ గ్యాస్ లీకై పలువురు అస్వస్థతకు గురైన ఘటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో వివరాలు తెలుసుకోవడానికి బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా క్లోరిన్ గ్యాస్ సిలెండర్‌ను ప్రతి నాలుగు నెలలకొకసారి మారుస్తుంటారని, సిలెండర్‌కు ఉన్న పైప్ వాచర్ పగిలిపోవడంతో ఒక్కసారిగా గ్యాస్ బయటకు రావడం అనంతరం పలువురు అస్వస్థతకు గురవడం, ఆసుపత్రికి తరలించడం జరిగాయని సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ఓవర్ హెడ్ ట్యాంకులో ఉన్న నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. రిపోర్ట్ వచ్చిన వెంటనే తాగునీటి సరఫరా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కవల గణపతి, కవల బాబులు, తిరుమలనాయుడు, చిన్నారి, చాగంటి రాము, కవల వెంకటేష్, కోన సత్తియ్య, పోలిశెట్టి తాతాజీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



అమలాపురంలో ఏపీడీ రాంబాబుకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అమలాపురం రూరల్: జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యోగుల ఐక్యవేదిక తరపున నిరసన కార్యక్రమాలు చేపడతామని అమలాపురం ఎంపీడీఓ కార్యాలయంలో డ్వామా ఏపీడీ రాంబాబుకు వారు వినతి పత్రం అందించారు. సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖలకు అప్పగించాలని, సమయ పాలనలేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని, కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవులు, పండగ రోజుల్లో బలవంతపు విధులు రద్దు చేయాలని కోరారు. ఆరేళ్ల ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు.

రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి

మలికిపురం: ప్రజలు, విద్యార్థులు రోడ్డు భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కాలేజీలో వినియోగదారుల హక్కులు, రోడ్డు భద్రత ప్రమాణాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. సంఘ అధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు సేవలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అందరూ పాటించడం వలన మన, ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. సీట్ బెల్ట్ హెల్మెట్ ధరించడం తప్పనిసరని వేగ పరిమితులు పాటించాలని మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావును దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నల్లి ఆనందమహాని, కోళ్ల వేణుప్రసాద్, గడ్డం తులసీభాస్కర్, ఎంఈఓలు విజయశ్రీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

సేవలను సద్వినియోగం చేసుకోండి



అమలాపురంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం టౌన్: ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. అమలాపురం ఈడబ్ల్యూఎస్ కాలనీలో కొత్తగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం గదులు, ల్యాబ్, చికిత్స విధానాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కేంద్రం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. ఇక్కడ అంటురోగాలు, ఇతర అనారోగ్య సమస్యలకు, గర్భ సంబంధ, బాలల ఆరోగ్య సేవలు, సాధారణ వైద్యం అందుతుందని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్, ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ ఎంఎం మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

యానాం: స్థానిక బైపాస్ రహదారికి చేర్చి కనకాలపేటలో ఉన్న డంపింగ్ యార్డును బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ అంకిత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల అభ్యర్థన మేరకు డంపింగ్ యార్డు తొలగించడంలో భాగంగా ఇప్పటివరకూ సుమారు రూ.2 కోట్లతో చెత్తను ప్రోసెసింగ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మిగిలి ఉన్న చెత్తను పూర్తి స్థాయిలో అదే పద్ధతిలో ప్రోసెసింగ్ చేయాలని అన్నారు.

సభ్యత్వ నమోదు చేసుకోవాలి

అమలాపురం రూరల్: అమలాపురం తాలూకా యూనిట్ ఉద్యోగులు సభ్యత్వ నమోదు చేసుకోవాలని ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు సీహెచ్ రాజశేఖర్ పిలుపునిచ్చారు. అమలాపురం, అంబాజీపేట, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలకు సంబంధించిన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులంతా సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98497 90124, 99894 83746 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

రేపు వివాదాస్పద స్థలం సర్వే

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలో వివాదాస్పద స్థలానికి సంబంధించి ఈ నెల 12న సంయుక్త సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు. బుధవారం దీనికి సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇరు వర్గాలతో తహసీల్దార్ త్రినాథరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ చర్చలు జరిపారు. సర్వే నంబరు 123, 125లలో ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి పంచాయతీ రాజ్, డ్రైనేజీ, రెవెన్యూ శాఖలతో సంయుక్తంగా సర్వే నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు, సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్ త్రినాథరావు తదితరులు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కారైకల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలకు యానాం రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14 బాలికల చెస్ విభాగానికి మల్లాడి శశివర్షిత, మల్లాడి శశివర్షిక, ఒంటిద్దు సుప్రియాంక, అండర్–14 బాలుర చెస్ విభాగానికి కొల్లు సాత్విక్ మణికంఠ, సాధనాల యువన్‌సంతోష్, వజ్రపు నిశాంత్‌కుమార్, అండర్–17 బాలికలలో కోడి వేదహర్షిని, సాధనాల లాస్యకమలని, అండర్–17 బాలికల యోగా విభాగంలో పట్టా దాక్షిణ్య ఎంపికైనట్లు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ బొట్టా శ్రీనివాస్‌ను అభినందించారు.

ఆలోచనలు అదుపులో ఉండాలి

మలికిపురం: విశ్వేశ్వరాయపురంలో బుధవారం ఆత్మహత్యలు లేని సమాజస్థాపనే ధ్యేయంగా పనిచేస్తున్న స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా 'వాక్ టాక్' అనే ప్రత్యేక కార్యక్రమం జరిగింది. విద్యార్థులు ఆత్మహత్యల నివారణ, జీవన విలువ, ఆశతో ముందుకు సాగడం, సానుకూల ఆలోచన వంటి విషయాలపై యుఆర్ వర్రీ, రెస్పెక్ట్ యువర్ సెల్ఫ్, వెయిట్, టుమారో ఈజ్ అనదర్‌డే అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సంస్థ జిల్లా ఇన్‌చార్జి ఎన్.రమేష్ బాబు విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ధైర్యం, జీవితంపై గౌరవం పెంపొందించుకోవాలన్నారు. స్పందనా ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫ్రైజ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ఆత్మహత్య అనేది సమస్యకు మార్గం కాదని, అది ఆశను కోల్పోవడమే అన్నారు. విద్యార్థులు నిరాశలో కాకుండా, ధైర్యంగా ముందుకు సాగాలని, అవసరమైతే తల్లిదండ్రులు, గురువులు, స్నేహితుల సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాజేష్, లక్ష్మి, పద్మజ, అరుణ పాల్గొన్నారు.

సమస్యను మురగబెట్టారు!

- డ్రైనేజీ వెతలకు కానరాని మోక్షం
- ప్రజాప్రతినిధులు చెప్పినా పట్టించుకోని వైనం
- సుంకరపాలెం జంక్షన్‌లో మురుగు వెతలు

తాళ్లరేవు: ప్రజాప్రతినిధులు వచ్చారు.. ప్రజల వెతలు విన్నారు.. పనులు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు.. ఇది జరిగి నెలన్నర అవుతున్నా ఇంచు మాత్రం స్పందన లేక ప్రజలకు మురుగు వెతలు తప్పడం లేదు.. తాళ్లరేవు మండలం సుంకరపాలెం జంక్షన్‌లో డ్రైనేజీ సమస్యకు మోక్షం కలగడం లేదు. దీంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి 216 యానాం బైపాస్, సుంకరపాలెం జంక్షన్‌లో ఎన్‌హెచ్ అధికారుల నిర్వాకం కారణంగా ఏర్పడిన డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అనేకసార్లు ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో జూలై 18న స్వయంగా అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతోపాటు, ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సాయిశ్రీనివాస్, యానాం మున్సిపల్ కమిషనర్ అఖిల్‌తో కలసి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ నుంచి మురుగునీరు లీకై రహదారిపై చేరడంతో దుర్గంధం వెదజల్లుతోందని, ఎన్నిసార్లు ఎన్‌హెచ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఐదేళ్లుగా మొత్తుకుంటున్నా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానిక సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు వారి దృష్టికి తీసుకు వచ్చారు. ఎన్‌హెచ్ నిర్మించిన డ్రైనేజీ కేవలం వర్షం నీరు పోవడానికి మాత్రమేనని, అయితే సమీప వ్యాపార దుకాణాలు, గృహాల మురుగునీరు డ్రైనేజీలో కలపడం వల్ల ఈ సమస్య తలెత్తిందని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. దీనికి పరిష్కారంగా ప్రస్తుతం ఉన్న డ్రైనేజీకి సమాంతరంగా మరో డ్రైనేజీని నిర్మించాలని, ఆ మేరకు నెల రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. అంతటితో ఆగకుండా భవిష్యత్‌లో ఎటువంటి సమస్యలు రాకుండా ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే నేతలు మాట ఇచ్చి నెలన్నర అవుతున్నా కనీసం పట్టించుకునే వారే కరవయ్యారని గ్రామస్తులు అంటున్నారు.



మురుగునీరు నిలిచిపోవడంతో వాహనదారుల అవస్థలు



సుంకరపాలెంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న ప్రజలు (ఫైల్)

రోడ్డెక్కుతున్న మురుగు

సమస్యను పట్టించుకోకపోవడంతో సుంకరపాలెం జంక్షన్‌లో డ్రైనేజీ నీరు రహదారిపైకి చేరి పారిశుధ్య సమస్య తాండవిస్తోంది. హైవే నుంచి ద్రాక్షారామకు వెళ్లే రహదారిలో నిత్యం మురుగు పారుతుండడంతో దుర్గంధం వెదజల్లుతూ స్థానికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మురుగు నీరు బయటకు పోయే మార్గం లేక రహదారిపై చేరుతోంది. దీంతో నీరు నిల్వ ఉంటుంది. వర్షం వచ్చిందంటే చాలు ప్రజల బాధలు వర్ణనాతీతం. రహదారిపై నీరు నిలిచిపోవడంతో అనేకమంది జారిపడుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కళాశాలలు, పాఠశాలలు అధికంగా ఉండడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా యానాం నుంచి ద్రాక్షారామ వెళ్లే ప్రయాణికులు అదే ప్రాంతంలో బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. దుర్గంధం భరించలేక ముక్కుమూసుకుంటున్నారు.

పత్తాలేకుండా పోయారు..



ప్రజాప్రతినిధుల సమక్షంలో డ్రైనేజీ సమస్యను నెలరోజుల్లో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిన ఎన్‌హెచ్ అధికారులు పత్తాలేకుండా పోయారు. కనీసం డ్రైనేజీలో పూడికలు కూడా తొలగించకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. ప్రజాప్రతినిధులు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు. తక్షణమే డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. లేకుంటే ఉద్యమిస్తాం.

– పుగాకు వాసు, వర్తక సంఘం అధ్యక్షుడు

దుర్గంధం భరించలేక..



నేను జంక్షన్‌లో మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాను. డ్రైనేజీ నుంచి మురుగు నీరు రహదారిపైకి రావడంతో నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నాం. దుర్గంధం వెదజల్లుతుంది. పనులు చేయలేకపోతున్నాం. మురుగునీరు చేరడంతో వినియోగదారులు కూడా రాకపోవడంతో వ్యాపారం పూర్తి స్థాయిలో సాగడం లేదు.

– కాదా రాము, వ్యాపారి